


**ఐసెట్ 2010 కౌన్సెలింగ్ నోటిఫికేషన్ త్వరలో వెలువడనుంది. ఐసెట్ ఉత్తీర్ణులు ఎక్కువగా ఆదరణ చూపిస్తోన్న కోర్సు... ఎంబీఏ. రాష్ట్రంలో వందల సంఖ్యలో ఎంబీఏ కాలేజీలు ఉన్నాయి. సీటు సాధించడం కష్టం కాకపోయినప్పటికీ, మంచి పేరున్న, ప్రమాణాలు పాటించే కాలేజీలో సీటు దక్కించుకోవడానికి పోటీని ఎదుర్కోక తప్పదు! కౌన్సెలింగ్‌కు హాజరవడానికి ముందు నుంచే కాలేజీల స్థితిగతులపై అవగాహన పెంచుకోవడం మంచిది. గత ఏడాది సీట్ల కేటాయింపు ధోరణి ఆధారంగా ఈ ఏడాది కౌన్సెలింగ్‌పై అంచనాకు రావచ్చు.**

# ఎంబీఏ కాలేజీ ఎంపిక ఇలా..!



**జి.ఆర్.రెడ్డి**
ఎం.డి., Husys

ఏ కోర్సులోనైనా ఆశించిన ఫలితం రావాలంటే మంచి కాలేజీలో చేరడంతో పాటు విద్యార్థి చేయాల్సిన కృషి చాలా ఉంటుంది. ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్లు, సౌకర్యాలు, మిగిలిన అంశాలు ఎంత బాగున్నా, విద్యార్థి కృషి లేకపోతే ప్రయోజనం ఉండదు. మేనేజ్‌మెంట్ డిగ్రీ కోసం పెట్టే పెట్టుబడికి తగిన ప్రతిఫలం పొందాలంటే కోర్సు కాలంలో విద్యార్థి దృక్పథంలో మార్పు అవసరం. పెట్టుబడి అంటే కాలేజీకి చెల్లించే ఫీజు ఒక్కటే కాదు, ఎంబీఏ కోసం వెచ్చించే రెండేళ్ల సమయం అంతకంటే విలువైన పెట్టుబడి. అందువల్ల ఈ సమయాన్ని ఎంత సమర్థంగా ఉపయోగించుకుంటారనే దాన్ని బట్టి ఫలితం ఆధారపడి ఉంటుంది.

✤ మేనేజ్‌మెంట్ విద్యలో అనువర్తిత దృక్పథం చాలా అవసరం. తరగతులు, పుస్తకాల ద్వారా నేర్చుకున్న సూత్రాలను ఆచరణలో పెట్టడం ఎంతో కీలకం. ఈ దిశగా విద్యార్థి ఆచరణలో నిజమైన మార్పు రావాలి. అన్ని రకాల సబ్జెక్టు నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇది ముఖ్యం.

కాలేజీని ఎంచుకునేటప్పుడు, దాని నిర్వాహకుల దృక్పథం, సమర్థతను పరిశీలించాలి. కాలేజీపై, తద్వారా విద్యార్థిపై ఖర్చు చేయడానికి మేనేజ్‌మెంట్ సుముఖంగా ఉన్నదీ లేనిదీ తెలుసుకోవాలి. మౌలిక సౌకర్యాల విషయంలోనే కాదు, విద్యార్థి సమగ్ర అభివృద్ధికి, అతనిలో వ్యాపార దృక్పథం పెంపొందించడానికి, వ్యాపారంలోని వాస్తవికతను అర్థం చేసుకోవడానికి నిర్వాహకులు ఏ మేరకు కృషి చేస్తున్నారో పరిశీలించాలి. కాలేజీ మేనేజ్‌మెంట్ సానుకూలత, విశ్వసనీయత వల్ల విద్యార్థికి సహజంగా అనేక ప్రయోజనాలు ఉంటాయి. విద్యార్థి ఆలోచన దృక్పథంపై దీని ప్రభావం ఉంటుంది.

## అధ్యాపక బృందం

మేనేజ్‌మెంట్ విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మార్పులు తీసుకొచ్చే వ్యక్తులు... బోధించే అధ్యాపక బృందం. అన్ని మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలు ఫ్యాకల్టీ నియామకాలకు సంబంధించి ప్రభుత్వ నియంత్రణ సంస్థల నియమాలను పాటించాలి. ఫ్యాకల్టీ అర్హతలు, అనుభవం కోర్సు కాలంలో విద్యార్థి ఏ మేరకు నేర్చుకోగలడనే అంశాన్ని నిర్ణయిస్తాయి. కాలేజీలో బోధన, పరిశ్రమల్లో పని చేసిన అనుభవం గల అధ్యాపకులు ఉంటే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది.

✤ పరిశ్రమల్లో పనిచేసిన అనుభవం గల అధ్యాపకులు విద్యార్థులను కూడా కంపెనీలకు అవసరమైన సామర్థ్యాలతో తీర్చిదిద్దగలరు. రకరకాల పరిశ్రమలు, సంస్కృతులు, ప్రదేశాల నుంచి వచ్చే అధ్యాపకుల అనుభవం విద్యార్థులకు అనేక విలువైన అంశాలను నేర్పుతుంది.

సంబంధిత కాలేజీలో చదివిన పాత విద్యార్థులు ఇచ్చే సమాచారం చాలా విలువైనది. కాలేజీలో వివిధ అంశాల గురించి, కాలేజీ వెలుపల దానికి గల పేరు ప్రతిష్ఠల గురించి తెలుసుకోవడానికి పాత విద్యార్థులను విశ్వసనీయమైన ఆధారంగా భావించవచ్చు. కాలేజీ నుంచి డిగ్రీతో బయటకు వచ్చాక కెరియర్‌ను నిర్ణయించే విషయాలేమిటో గత విద్యార్థులు బాగా చెప్పగలరు.

✤ గత విద్యార్థులు ఎవరైనా ఫ్యాకల్టీగా పనిచేస్తుంటే మంచిది. మీ కెరియర్‌ను తీర్చిదిద్దుకోవడానికి వారిని ఆదర్శంగా తీసుకోవచ్చు. పాత విద్యార్థుల నెట్‌వర్క్ పటిష్ఠంగా ఉంటే ఇప్పుడు కాలేజీలో చేరే విద్యార్థులకు చాలా ప్రయోజనం ఉంటుంది.

## వ్యాపారవేత్తను వెలికితీయాలి!

కాలేజీ ఎంపికలో ప్లేస్‌మెంట్లు ముఖ్యమైనవే! చాలామంది విద్యార్థులు ఇదొక్కటే ముఖ్యమైన అంశంగా భావిస్తుంటారు. కాలేజీలు కూడా దీన్నే ఎక్కువగా ప్రచారం చేస్తుంటాయి. విద్యార్థిలోని వ్యాపార లక్షణాలను, సామర్థ్యాలను వెలికి తీయడం మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రథమ కర్తవ్యం. విద్యార్థి సొంతగా వ్యాపారం చేయడానికి అవసరమైన సామర్థ్యాలను సాధించి, మేనేజ్‌మెంట్ ఉద్యోగికి అవసరమైన లక్షణాలను పెంపొందించుకోవాలి. ప్రతిష్ఠాత్మక బిజినెస్ స్కూళ్లు కేవలం ప్లేస్‌మెంట్ల ఆధారంగానే విద్యార్థులను ఆకర్షించవు. విద్యార్థిని ఒక సమగ్రమైన, సమర్థుడైన వ్యాపారవేత్తగా తయారుచేస్తాయి. అప్పుడు ప్లేస్‌మెంట్లు వాటంతటవే వస్తాయి.

✤ మేనేజ్‌మెంట్ విద్య ద్వారా ఎంతమంది స్వతంత్ర వ్యాపారవేత్తలను కాలేజీ తయారు చేసిందనేది ముఖ్యం. పెట్టుబడి పెట్టే కంపెనీల సహకారంతో విద్యార్థులు ఎవరైనా సొంతగా వ్యాపారం చేస్తున్నారేమో విచారించాలి. తర్వాత ప్లేస్‌మెంట్ల సంఖ్య, నాణ్యతను పరిశీలించాలి.

## ఎం.డి.పి. ప్రోగ్రామ్‌లు

కాలేజీలో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు ఉంటే మంచిది. పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ ప్రోగ్రామ్‌లు ఆఫర్ చేస్తారు కాబట్టి దీని ఆధారంగా కాలేజీ, ఫ్యాకల్టీ సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. పరిశ్రమల్లో పనిచేసిన అనుభవం ఉన్న ఫ్యాకల్టీ ఉంటే ఇలాంటి ప్రోగ్రామ్‌లకు కంపెనీల నుంచి మంచి స్పందన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లలో పాల్గొనేవారు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటారు. వీరి ద్వారా ప్లేస్‌మెంట్ల సమయంలో ప్రయోజనం పొందవచ్చు.

## పరిశోధన, కన్సల్టింగ్

తెలిసిన దానికి కొత్త విషయాలను జోడించడం, ఆచరించడం మేనేజ్‌మెంట్ విద్యలో ముఖ్యమైన అంశాలు. కాలేజీలో పరిశోధనలు బాగా జరుగుతున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. పేరుపొందిన జర్నళ్లలో అధ్యాపకుల పరిశోధనలు ప్రచురితమవుతుంటే మంచిది. పరిశోధనలకు కాలేజీలో ప్రత్యేక విభాగం ఉంటే మరీ మంచిది. ప్రచురణలను, పరిశోధన ఫలితాలను విద్యార్థులు కూడా ఉపయోగించుకోవచ్చు.

✤ ఎవరైనా అధ్యాపకులు పరిశ్రమలకు కన్సల్టింగ్ సేవలు అందిస్తున్నారేమో పరిశీలించాలి. ఇలాంటి అధ్యాపకులు కాలేజీలో ఉంటే చాలా ప్రయోజనం ఉంటుంది. కంపెనీల ఆలోచనలు, ప్రణాళికలు, ఆచరణ, తదితర అంశాలకు సంబంధించి విద్యార్థులు అవగాహన పెంచుకోవచ్చు.

✤ కొన్ని కాలేజీలు శిక్షణలో కంపెనీలకు భాగస్వామ్యం కల్పిస్తాయి. కంపెనీలు మొదటి నుంచి తమకు అవసరమైన రీతిలో విద్యార్థులకు శిక్షణ ఇస్తాయి. కాలేజీల్లోనే బ్యాక్ ఆఫీసు వాతావరణం కల్పిస్తాయి. తద్వారా విద్యార్థులు మరింత ఆచరణాత్మక రీతిలో విషయాలను అర్థం చేసుకోవడం వీలవుతుంది.

✤ విద్యార్థులు పరిశ్రమల్లో ఎక్కువ సమయం గడపడానికి అనుమతించే కాలేజీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ సమయం ఎంత ఎక్కువగా ఉంటే విద్యార్థికి అంత ఉపయోగం ఉంటుంది. పరిశ్రమల్లో చేసే ప్రాజెక్టులకు కాలేజీ ఏ మేరకు ప్రాధాన్యం ఇస్తుందో ముందే తెలుసుకోవాలి.

## సౌకర్యాలు ఉంటేనే ఆచరణ!

కాలేజీలో మౌలిక సౌకర్యాలు ఉన్నప్పుడే విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టడానికి అవకాశం ఉంటుంది. కేవలం అద్దాల భవనాలు, ఏసీ గదులు, ఉచిత ల్యాప్‌టాప్ లాంటి ఆఫర్లు చూసి కాలేజీని ఎంచుకోవడం మంచిది కాదు. చదువుకున్న విషయాలను సాధన చేసి, ఆచరణలో పెట్టడానికి అవకాశం లేనప్పుడు వీటి వల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. నేర్చుకోవడానికి సరైన సౌకర్యాలు గల కాలేజీలో చదువుతున్నప్పుడు విద్యార్థికి కాలేజీపై అభిమానం ఏర్పడుతుంది.

✤ పరిశ్రమలకు దగ్గరగా ఉండే కాలేజీలకు, పరిశ్రమల నిపుణుల సలహాలు, సూచనలు లభించే కాలేజీలకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. మౌలిక సౌకర్యాలు బాగుంటే అసైన్‌మెంట్లు, పరిశ్రమలతో సంబంధాల విషయంలో ప్రయోజనం ఉంటుంది.

✤ కాలేజీలో ఉన్నప్పుడు సౌకర్యాల సంగతి సరే, కాలేజీ నుంచి బయటకు వచ్చాక విద్యార్థులు నేర్చుకోవడంపై దృష్టి పెట్టడం కూడా అవసరం. ఇంట్లో లేదా రూమ్‌లో పర్సనల్ కంప్యూటర్, ఇంటర్నెట్ ఉంటే ఉపయోగకరం. సొంతగా వీలుకాకపోతే, కొంత మంది స్నేహితులు కలిసి ఏర్పాటు చేసుకోవచ్చు.

## గుణగణాల అంచనా...

ఎంబీఏ కాలేజీ గుణగణాలను అంచనా వేయడానికి కింది ప్రశ్నావళి కొంతమేరకు ఉపయోగపడుతుంది. దీని ద్వారా వివిధ అంశాల్లో కాలేజీ స్థాయిని స్వయంగా సమీక్షించుకోవచ్చు. మీ స్పందనను టిక్ (✓) మార్కుతో సూచించి కింద తెలిపిన విధంగా మార్కులు కేటాయించాలి.

| ప్రశ్నలు | బాగుంది | పర్వాలేదు | బాగోలేదు |
|---|---|---|---|
| ◆ కాలేజీ నిర్మాణం ఎలా ఉంది? | | | |
| ◆ లైబ్రరీ సౌకర్యం ఎలా ఉంది? | | | |
| ◆ ల్యాబ్ ఏ విధంగా ఉంది? | | | |
| ◆ తరగతి గదుల పరిస్థితి? | | | |
| ◆ రవాణా సౌకర్యం ఎలా ఉంది? | | | |
| ◆ హాస్టల్ సౌకర్యం ఏ విధంగా ఉంది? | | | |
| ◆ కాలేజీని చూడటానికి వెళ్లినప్పుడు పాలనా సిబ్బంది స్పందన ఎలా ఉంది? | | | |
| ◆ కాలేజీ నిర్వాహక వ్యవస్థను ఏ మేరకు అర్థం చేసుకోగలిగారు? | | | |
| ◆ పరిశ్రమల్లో అనుభవం గల ఫ్యాకల్టీ విషయంలో కాలేజీ పరిస్థితి ఎలా ఉంది? | | | |
| ◆ సహాయం కోసం ఫ్యాకల్టీని కలిసినప్పుడు వారి స్పందన ఎలా ఉంది? | | | |
| ◆ కాలేజీ గురించి విద్యార్థుల స్పందన ఎలా ఉంది? | | | |
| ◆ పాత విద్యార్థుల అసోసియేషన్ క్రియాశీలకంగా ఉందా? | | | |
| ◆ ప్లేస్‌మెంట్ల కోసం వచ్చిన కంపెనీల స్థాయి? | | | |
| ◆ కాలేజీలో ప్లేస్‌మెంట్లపై గత విద్యార్థుల అభిప్రాయం? | | | |
| ◆ ఇటీవలి కాలంలో నిపుణుల ఉపన్యాసాలు, సదస్సులు..? | | | |
| ◆ కాలేజీలో గ్రూప్ డిస్కషన్‌లు, మాక్ ఇంటర్వ్యూలు, వక్తృత్వ పోటీలు ఏ మేరకు జరుగుతున్నాయి? | | | |
| ◆ పరిశ్రమలు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయా? | | | |
| ◆ కంపెనీల్లో ఎక్కువ సమయం వెచ్చించడానికి కాలేజీ సుముఖంగా ఉంటుందా? | | | |
| ◆ పాఠ్యప్రణాళికేతర కార్యకలాపాలు (క్రీడలు, సెమినార్లు మొదలైనవి) ఎలా ఉన్నాయి? | | | |

### మార్కుల కేటాయింపు..

ఇందులో మొత్తం 19 ప్రశ్నలున్నాయి. ఇచ్చిన స్పందనను బట్టి కింది విధంగా మార్కులను కేటాయించాలి.

- బాగుంది- 2 మార్కులు
- పర్వాలేదు- 1 మార్కు
- బాగోలేదు- 0 మార్కు

### ఫలితం ఇదీ!

- మొత్తం స్కోరు 33-38 మధ్య ఉంటే- అద్భుతమైన కాలేజీగా భావించవచ్చు. ఆ కాలేజీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వొచ్చు.
- స్కోరు 27-32 మధ్య వస్తే- చాలా మంచి కాలేజీ అని చెప్పొచ్చు. రెండో ప్రాధాన్యం ఇవ్వొచ్చు.
- 20-26 మధ్య ఉంటే- మంచి కాలేజీ అనుకోవచ్చు. చేరడానికి పరిశీలనలోకి తీసుకోవచ్చు.
- మొత్తం స్కోరు 20 కంటే తక్కువగా వస్తే- సాధారణ కాలేజీ అని అర్థం. చేరడానికి నిర్ణయం తీసుకునే ముందు ఒకసారి ఆలోచించడం మంచిది. వీలైతే ప్రత్యామ్నాయం చూసుకోవచ్చు.

ఈ ప్రశ్నావళి, ఫలితాలు కాలేజీలపై ఒక ప్రాథమిక అంచనాకు రావడానికి ఉపయోగపడతాయి. విద్యార్థులు తాము చేరబోయే కాలేజీ గురించి మరింత లోతుగా పరిశీలించడం ద్వారా అంతిమ నిర్ణయం తీసుకోవాలి.

## గత ఏడాది యూనివర్సిటీ కాలేజీల్లో ఎంబీఏ సీట్లు సాధించిన చివరి ర్యాంకులు

| యూనివర్సిటీ | ఓసి | | ఎస్సి | | ఎస్టీ | | బీసీ-ఎ | | బీసీ-బి | | బీసీ-సి | | బీసీ-డి | | బీసీ-ఇ | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు |
| ఆదికవి నన్నయ యూనివర్సిటీ | 8479 | 8821 | 57734 | 45659 | 0 | 80249 | 28609 | 27347 | 24567 | 10376 | 0 | 0 | 17612 | 41364 | 14766 | 14766 |
| ఆచార్య నాగార్జున యూనివర్సిటీ | 3211 | 3280 | 17057 | 31645 | 51626 | 33898 | 8960 | 10123 | 3669 | 4387 | 0 | 0 | 3583 | 3322 | 4529 | 4529 |
| కృష్ణా యూనివర్సిటీ | 21472 | 21561 | 59977 | 58290 | 122073 | 122073 | 54273 | 55709 | 35204 | 35056 | 20162 | 55003 | 22290 | 38255 | 53159 | 114721 |
| బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ | 11885 | 10266 | 29776 | 58728 | 119130 | 36393 | 32631 | 26983 | 28637 | 39707 | 0 | 0 | 13456 | 18941 | 0 | 43649 |
| ఆంధ్రా యూనివర్సిటీ | 1260 | 477 | 4268 | 6308 | 12524 | 22648 | 925 | 698 | 699 | 665 | 348 | 5003 | 384 | 892 | 693 | 975 |
| ఉస్మానియా యూనివర్సిటీ | 388 | 454 | 2894 | 4070 | 6808 | 8115 | 1050 | 2338 | 498 | 1198 | 2180 | 2180 | 871 | 712 | 0 | 574 |
| శాతవాహన యూనివర్సిటీ | 29075 | 30008 | 61248 | 129747 | 52724 | 52724 | 60853 | 73166 | 39633 | 65121 | 53660 | 53660 | 34514 | 69284 | 33082 | 54977 |
| తెలంగాణ యూనివర్సిటీ | 23789 | 29509 | 61198 | 79778 | 72251 | 119467 | 51254 | 75111 | 37331 | 53500 | 0 | 114478 | 36539 | 38844 | 39263 | 39263 |
| కాకతీయ యూనివర్సిటీ | 4435 | 5561 | 14947 | 26887 | 33568 | 36692 | 10914 | 13244 | 5958 | 7825 | 0 | 0 | 9063 | 13430 | 10931 | 9835 |
| శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ | 4481 | 4400 | 18004 | 31713 | 39499 | 101870 | 6933 | 19717 | 5711 | 7330 | 0 | 3533 | 5279 | 7364 | 6378 | 6378 |
| శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ | 881 | 1501 | 5208 | 9127 | 6469 | 7470 | 1631 | 2074 | 1351 | 2100 | 95 | 95 | 1921 | 3489 | 0 | 2072 |
| యోగి వేమన యూనివర్సిటీ | 7378 | 8573 | 28370 | 38251 | 40833 | 94667 | 14500 | 76880 | 11655 | 16662 | 0 | 50386 | 20870 | 26347 | 18485 | 18485 |
| విక్రమ సింహపురి యూనివర్సిటీ | 23775 | 21983 | 86062 | 100214 | 90845 | 137716 | 35640 | 59654 | 40778 | 77294 | 0 | 0 | 38277 | 35269 | 35237 | 50341 |

**వీటితోపాటు ఇతర యూనివర్సిటీల్లో అందిస్తోన్న ఎంబీఏ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు, ప్రైవేటు కాలేజీల్లో గత ఏడాది సీట్లు సాధించిన చివరి ర్యాంకుల సమాచారం www.apsche.org లో లభిస్తుంది.**